ఢిల్లీకి దారి బంద్!

డిమాండ్ల సాధనకు రేపు రైతన్నల 'ఢిల్లీ చలో' మార్చ్

పాల్గొననున్న 200కుపైగా రైతు సంఘాలు • ఢిల్లీ సరిహద్దుల్లో బారికేడ్లు ఏర్పాటు

హర్యానా ప్రభుత్వం కఠిన చర్యలు • 144 సెక్షన్.. ఇంటర్నెట్‌పై నిషేధం విధింపు

ఆదివారం పంజాబ్-హర్యానాలోని శంభూ సరిహద్దు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

న్యూఢిల్లీ/చండీగఢ్, ఫిబ్రవరి 11: అన్నదాతలు మరోసారి పోరుబాట పట్టారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ ఇతర డిమాండ్లు పరిష్కరించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దాదాపు 200కు పైగా రైతు సంఘాలు ఈ నెల 13న(మంగళవారం) 'ఢిల్లీ చలో' మార్చ్ నిర్వహించతలపెట్టాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోకి రైతులు ప్రవేశించకుండా అధికారులు సరిహద్దుల్లో అధిక బలగాలను మోహరించారు. సింఘూ, ఘాజీపూర్, టిక్రి సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. రైతులతో కూడిన వాహనాలు ఢిల్లీలోకి ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రైతుల వాహనాలు పంక్చర్ అయ్యేలా పలు చోట్ల ఇనుప మేకులు కూడా ఏర్పాటు చేశారు. హర్యానా-ఢిల్లీ, యూపీ-ఢిల్లీ సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లను ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా ఆదివారం పరిశీలించారు. రాజధానిలోకి ప్రవేశించే రోడ్లను బ్లాక్ చేసేందుకు పెద్ద కంటెయినర్లను తరలిస్తున్నారు. బస్సు, రైలు లేదా ఏ ఇతర మార్గంలోనూ రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా చూసేలా పలు బృందాలతో నిఘా పెట్టారు. ఈశాన్య ఢిల్లీలో 144 సెక్షన్ కూడా విధించి నిషేధ్దాలు అమలు చేస్తున్నారు. 'ఢిల్లీ చలో' ఆందోళనకు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ నుంచి పెద్దయెత్తున రైతులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు.

హర్యానా-పంజాబ్ సరిహద్దు మూసివేత

మరోవైపు హర్యానాలోని ఖట్టర్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రైతులను నిలువరించేందుకు పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించింది. పంజాబ్ నుంచి రాష్ట్రంలోకి రైతులు ప్రవేశించకుండా సరిహద్దుల్లో సిమెంట్ బారికేడ్లు, ఇనుప కంచెలను సిద్ధం చేసింది. కొన్ని చోట్ల రోడ్లపై కొంత మంది ఇనుప మేకులను డ్రిల్లింగ్ చేస్తుండటం కనిపించిందని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. వాహనాలను అంబాలా నుంచి ఢిల్లీ వైపు వెళ్ల నీయకుండా శంభు వద్ద హర్యానా-పంజాబ్ సరిహద్దును మూసివేశారు. ఆదివారం నుంచి మంగళవారం రాత్రి వరకు అంబాలా, కురుక్షేత్ర సహా ఏడు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్ సేవలపై ఆంక్షలు విధించారు. చాలా జిల్లాల్లో 144 సెక్షన్ విధించింది. ఢిల్లీకి సమీపంగా ఉండే సరిహద్దు సోనిపట్‌లో సీసాలు, ఇతర డబ్బాల్లో ఇంధనం నింపవద్దని ఆయిల్ బంకుల యాజమానులకు జిల్లా యంత్రాంగం సూచించింది. ట్రాక్టర్లకు ఇంధన ఫిల్లింగ్‌ను 10 లీటర్ల వరకే పరిమితం చేసింది.

నేడు రైతు నేతలతో కేంద్రం చర్చలు

రైతు సంఘాల చలో ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో కేంద్రం రైతు నేతలను చర్చలకు ఆహ్వానించింది. సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపించేందుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానంద్ రాయ్ సోమవారం చండీగఢ్ రానున్నారని రైతుల నేత శర్వాన్ సింగ్ పంధేర్ పేర్కొన్నారు. మరోవైపు రైతులతో చర్చించాలని పంజాబ్ సీఎం మాన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంజాబ్, ఇండియా మధ్య సరిహద్దు నిర్మించొద్దని కేంద్రాన్ని కోరారు.

రైతుల డిమాండ్లు ఇవీ

- పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత
- స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు
- రైతు రుణాల మాఫీ
- రైతులు, వ్యవసాయ కార్మికులకు పింఛను
- లఖింపూర్ బాధితులకు న్యాయం
- రైతులపై కేసుల ఉపసంహరణ

బీహార్ అసెంబ్లీలో నేడు బలపరీక్ష

పాట్నా, ఫిబ్రవరి 11: జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి సోమవారం బీహార్ అసెంబ్లీలో బల పరీక్షను ఎదుర్కోబోతున్నది. ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు ఆర్జేడీ, జేడీయూ సహా వివిధ పార్టీలు వారిని గృహ నిర్బంధంలో ఉంచారని మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఆదివారం పాట్నాలో ఏర్పాటు చేసిన పార్టీ ఎమ్మెల్యే సమావేశానికి ముగ్గురు జేడీయూ సభ్యులు గైర్హాజరవ్వటం కలకలం రేపింది. అయినప్పటికీ..నేడు జరగబోయే బలపరీక్షలో గెలుస్తామని సీఎం నితీశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహాగట్‌బంధన్ (ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్)), ఎన్డీయే కూటమి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఆర్జేడీ ఎమ్మెల్యేలందర్నీ తేజస్వీ యాదవ్ గృహ నిర్బంధంలో ఉంచారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఇది పూర్తిగా అవాస్తమని చెబుతూ ఆర్జేడీ..సోషల్‌మీడియాలో ఓ వీడియోను విడుదల చేసింది. గత కొన్ని రోజులుగా గయలోని మహాబోధి రిసార్ట్‌లో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు బయటకు వచ్చారు. ఆదివారం ప్రత్యేక బస్సులో పాట్నాకు చేరుకున్నారు. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 122 మంది సభ్యుల బలం అవసరం. బీజేపీ-78, జేడీయూ-45, హెచ్ఏఎం(ఎస్)-4, ఐఎన్‌డీ-1లతో కూడిన ఎన్డీయే కూటమికి మొత్తం 128 మంది ఎమ్మెల్యేల బలమున్నట్టు సమాచారం. మహాగట్‌బంధన్ పేరుతో ఒక్కటైన ఆర్జేడీ-79, కాంగ్రెస్-19, సీపీఐ(ఎంఎల్)-12, సీపీఎం-2, సీపీఐ-2, ఇతరులు-1, ఏఐఎంఐఎం-1..కూటమికి 114 మంది ఎమ్మెల్యేల మద్దతుంది.

కాంగ్రెస్ గిరిజన వ్యతిరేకి:మోదీ

జబువా/టంకార : కాంగ్రెస్ పార్టీ గిరిజన వ్యతిరేకి అని, వారికి ఎన్నికలప్పుడే గ్రామాలు, రైతులు, పేదలు గుర్తుకు వస్తారని ప్రధాని మోదీ విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని మరోసారి ధీమా వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌లోని జబువా జిల్లాలో ఆదివారం గిరిజనులతో ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ మరోవైపు ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఆయన జన్మస్థలం టంకారాలో ఆదివారం ఏర్పాటు చేసిన వేడుకల్లో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రజలు బానిసత్వం, మూఢ నమ్మకాలతో మగ్గుతున్న స్థితిలో భారతీయ సమాజం తిరిగి వేదాలను ఆశ్రయించాలని పిలుపునిచ్చిన మహనీయుడు స్వామి దయానంద సరస్వతి అని ప్రశంసించారు.

కర్ణాటకలో గ్యారెంటీలపై రచ్చ

బెంగళూరు: కర్ణాటకలో తమ ప్రభుత్వం అమలుజేస్తున్న గ్యారెంటీ పథకాలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ సీఎం సిద్దరామయ్య కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సవాల్ విసిరారు. గ్యారెంటీ పథకాల వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ కాలేదన్న సంగతి తాను నిరూపిస్తానన్నారు. ఆదివారం ఉదయం మైసూరు చేరుకున్న అమిత్‌షా మీడియాతో మాట్లాడుతూ.. గ్యారెంటీ పథకాల వల్లే రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని విమర్శించారు. దీనిపై సిద్దరామయ్య స్పందిస్తూ, 'పన్నుల వాటా, ఇతర నిధుల్ని కేంద్రం విడుదల చేయకపోవటం వల్లే ఖజానా ఖాళీ అయ్యింది. అంతే తప్ప.. గ్యారెంటీ పథకాలతో కాదు' అని అన్నారు.

మీ అమ్మనాన్న నాకు ఓటేయకుంటే తిండి మానండి!

ముంబై, ఫిబ్రవరి 11: ఎన్నికల ప్రచారానికి పిల్లలను వాడుకోవద్దన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను మహారాష్ట్రకు చెందిన ఓ ఎమ్మెల్యే ఉల్లంఘించారు. ఓ పాఠశాలను సందర్శించిన శివసేన ఏక్‌నాథ్ షిండే వర్గం ఎమ్మెల్యే సంతోష్ బంగార్ విద్యార్థులతో మాట్లాడుతూ 'ఎన్నికల్లో ఓట్లన్నీ నాకే పడాలి. ఇలా జరగాలంటే మీరంతా మీ తల్లిదండ్రులకు చెప్పాలి. సంతోష్ బంగార్‌కు ఓటు వేస్తేనే తిండి తింటామని, లేకుంటే తినమని కండీషన్ పెట్టాలి. అయినా ఓటు వేయకుంటే రెండు రోజులు తినడం మానేయాలి' అని సూచించారు. సంతోష్ వ్యాఖ్యలను విపక్షాలు ఖండించాయి.

ఈ పడాది సమృద్ధిగానే వర్షాలు!

వాతావరణ శాస్త్రవేత్తల అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఎల్‌నినో పరిస్థితులు ఈ ఏడాది జూన్ నాటికి బలహీనం అవుతాయని, ఫలితంగా భారత్‌లో వచ్చే రుతు పవన కాలంలో సమృద్ధిగానే వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల బలహీనం ప్రారంభం అయిందని, ఆగస్టు నాటికి లానినా పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నదని తాజాగా పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈసారి రుతుపవన వర్షాలు మెరుగ్గానే పడుతాయని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ పేర్కొన్నారు. నైరుతి రుతు పవనాల సమయంలో పడే వర్షాలు దేశ వ్యవసాయ రంగానికి కీలకమైన విషయం తెలిసిందే.

ఉల్లిగడ్డల స్మగ్లింగ్.. కోట్లలో దందా

ముంబై (నమస్తే తెలంగాణ) : చెన్నై, ముంబై, బీహార్ నుంచి బంగ్లాదేశ్, దుబాయ్, శ్రీలంక తదితర దేశాలకు ఉల్లిగడ్డల స్మగ్లింగ్ జరుగుతున్నట్టు తెలుస్తున్నది. భారత్‌లో మినహా ఇతర దేశాల్లో కిలో ఉల్లిగడ్డ వెయ్యి రూపాయలు పైనే ఉండటంతో స్మగ్లర్లు అక్రమ రవాణాకు తెగించారు. రోజూ ఉల్లిని అక్రమంగా తరలిస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. క్వింటాలుకు రూ.వెయ్యి చొప్పున ఉల్లిని కొనుగోలు చేసి.. విదేశాలకు రూ.9-10 వేల వరకు విక్రయిస్తున్నారు. దేశం నుంచి రోజూ 10-12 కంటైనర్లలో 300 టన్నుల ఉల్లి అక్రమ రవాణా అవుతున్నది. ఈ రాకెట్‌లో కొందరు కస్టమ్స్ అధికారుల పాత్ర ఉన్నట్లు తెలుస్తున్నది. ఉల్లిగడ్డల ఎగుమతుల లావాదేవీలన్నీ హవాలా మార్గంలో జరుగుతున్నట్లు సమాచారం. నాసిక్‌లోని మాలేగావ్, ముంగ్సే, లాసల్ గావ్, పింపాల్ గావ్‌ల నుంచి ఈ రాకెట్‌ను నడుపుతున్నారు.

శ్రీలంక, మారిషస్‌లోనూ యూపీఐ సేవలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత్‌కు చెందిన యూపీఐ ఆధారిత చెల్లింపులు శ్రీలంక, మారిషస్ దేశాల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన వర్చువల్ కార్యక్రమంలో భారత ప్రధాని మోదీ, శ్రీలంక, మారిషస్ దేశాలకు చెందిన అధినేతలు పాల్గొననున్నారు. అదే విధంగా మారిషస్‌లో రూపే కార్డు సేవల ప్రారంభాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్టు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. శ్రీలంక, మారిషస్‌తో భారత ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతున్న తరుణంలో ఆ దేశాల్లో భారత సేవలు ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్నది.

హంగేరీ అధ్యక్షురాలు రాజీనామా

క్షమాభిక్ష ఇచ్చి తప్ప చేశానని వెల్లడి

బుడాపెస్ట్, ఫిబ్రవరి 11: పిల్లల లైంగిక వేధింపుల కేసులో దోషిగా తేలిన వ్యక్తికి క్షమాభిక్ష ప్రసాదించిన హంగేరీ అధ్యక్షురాలు కేటలిన్ నోవాక్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. క్షమాభిక్ష విషయంలో తాను తప్పుడు నిర్ణయం తీసుకున్నానని, అందుకే రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఓ చిల్డ్రన్ హోం నిర్వాహకులు పిల్లలను లైంగికంగా వేధిస్తున్న విషయాన్ని కప్పిపుచ్చిన ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్‌ను కోర్టు దోషిగా తేల్చి శిక్ష విధించింది. అయితే ఆ వ్యక్తికి అధ్యక్షురాలు కేటలిన్ క్షమాభిక్ష ప్రసాదించారు. దీంతో ప్రజలతోపాటు రాజకీయ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏకంగా అధ్యక్షురాలి భవనం ముందే శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో తాను తప్పుడు నిర్ణయం తీసుకున్నానంటూ కేటలిన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.

హేలి భర్త ఎక్కడ?

ట్రంప్ ఎగతాళి

వాషింగ్టన్, ఫిబ్రవరి 11: అమెరికా అధ్యక్ష పదవికి తన సొంత రిపబ్లికన్ పార్టీలోనే ప్రత్యర్థిగా ఉన్న ఇండో అమెరికన్ నిక్కి హేలిపై మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యంగ్యంగా విమర్శలు చేశారు. విదేశాల్లో ఉన్న ఆమె మిలటరీ భర్త వెంట లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ హేలిభర్త ఎక్కడ? అంటూ ఎగతాళి చేశారు. దీనిపై స్పందించిన హేలి సైనిక కుటుంబాలను అవమానించే వ్యక్తికి కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉండే అర్హత లేదని దీటుగా బదులిచ్చారు. 'ట్రంప్.. నువ్వేమన్నా చెప్పాలనుకుంటే నా వెనుక చెప్పొద్దు. ఇద్దరం చర్చ పెట్టుకుందాం. నీవు చెప్పాల్సిందేమన్నా ఉంటే అక్కడే నా ముఖం మీద చెప్పు' అని అన్నారు. 75 ఏండ్ల దాటిన రాజకీయవేత్తల మానసిక పరిస్థితిపై పరీక్షలు చేయించాలని తాను ఎప్పటి నుంచో చెబుతున్నానన్నారు. కాగా, హేలి భర్త మేజర్ మైఖేల్ హేలి దక్షిణ కరోలినా నేషనల్ గార్డులో కమిషన్డ్ అధికారిగా ఉన్నారు. గత ఏడాది జూన్ నుంచి ఆయన అక్కడే ఉన్నారు.

దవాఖానలో రీల్స్

38 మంది వైద్యులపై చర్యలు

బెంగళూరు: కర్ణాటకలోని గదగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(జిమ్స్)లో 38 మంది జూనియర్ వైద్యులు రీల్స్ షూట్ చేయడం కలకలం రేపింది. దవాఖానా వరండాలో హిందీ, కన్నడ పాటలకు డ్యాన్సులు చేస్తూ రచ్చ చేసిన వారి వీడియోలు వైరల్ కావడంతో దవాఖానా మేనేజ్‌మెంట్ తీవ్రంగా స్పందించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోపాటు వారు 'ఘోర తప్పిదం' చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. వారేమైనా చేయాలనుకుంటే దవాఖాన బయట చేయాల్సిందని, ఇలాంటి వాటికి తాము అనుమతి ఇవ్వబోమని దవాఖాన డైరెక్టర్ డాక్టర్ బసవరాజ్ బొమ్మనహళ్లి తెలిపారు. ప్రీ గ్రాడ్యుయేషన్ వేడుక కోసమే తాము రీల్స్ షూట్ చేసినట్టు విద్యార్థులు తెలిపారని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు వారిపై చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

'ట్రయల్ కోర్టులను దిగువ కోర్టులు అనొద్దు'

న్యూఢిల్లీ: ట్రయల్ కోర్టులను దిగువ కోర్టులుగా పేర్కొనటాన్ని వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి ఉత్తర్వులు ఇచ్చింది. ట్రయల్ కోర్టు రికార్డులను కూడా టీసీఆర్ (ట్రయల్ కోర్టు రికార్డు)గా పరిగణించాలని ధర్మాసనం తెలిపింది. 1981నాటి ఓ హత్య కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు మరణశిక్ష విధించింది. ఈ కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును నిందితులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసుపై విచారణ జరుపుతూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం పై ఉత్తర్వులు జారీ చేసింది.

14న యూపీఎస్సీ నోటిఫికేషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఐఏఎస్, ఐపీఎస్ లాంటి సివిల్ సర్వీసులకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రతి ఏడాది నిర్వహించే సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) నోటిఫికేషన్ ఈ నెల 14న విడుదల కానుంది. యూపీఎస్సీ విడుదల చేసిన పరీక్ష కేలండర్ ప్రకారం అదే రోజు నుంచి ప్రారంభించి, మార్చి 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష మే 26న, మెయిన్స్ అక్టోబర్ 19న నిర్వహిస్తారు.

మెడికల్ సీట్లలో దక్షిణాదికి అన్యాయం

- **నిబంధనలను సవరించాలి**
- **కేంద్రానికి స్టాండింగ్ కమిటీ సిఫార్సు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: దేశంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, సీట్ల సంఖ్యపై విధించిన నిబంధనలను పునఃపరిశీలించి, సవరించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి సూచించింది. కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) విధించిన నిబంధనలు, ఇతర అంశాల అధ్యయనానికి ఎంపీలతో ఏర్పాటు చేసిన కమిటీ 'ప్రాంత నిర్దిష్ట నిబంధనలు' పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం, వారు కొత్తగా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయలేని పరిస్థితిపై ప్రభుత్వానికి ఇటీవల నివేదిక అందించింది. ప్రతి పదిలక్షల మందికి 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించాలన్న ఎంఎన్‌సీ నిబంధనలను అనుసరిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడా కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటు కాదని స్పష్టం చేసింది. ఎందుకంటే ప్రతి దక్షిణాది రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య జనాభా ఆధారిత ఫార్ములా ఇప్పుడు ఎంఎన్‌సీ సూచించిన దానికంటే ఎక్కువగా ఉంది. ఉదాహరణకు తెలంగాణలో 2021 నాటికి 3.77 కోట్ల జనాభాకు 8,540 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఏపీలో 5.27 కోట్లకు 6,435 సీట్లు, తమిళనాడులో 7.64 కోట్లకు 11,600 సీట్లు, కర్ణాటకలో 6.68 కోట్లకు 11,695 సీట్లు, కేరళలో 3.54 కోట్లకు 4,665 సీట్లు ఉన్నాయి. అయితే ఎన్ఎంసీ నూతన నిబంధనల ప్రకారం చూస్తే తమిళనాడుకు గరిష్ట ఎంబీబీఎస్ సీట్లు 7,600, కర్ణాటకకు 6,700, కేరళకు 3,500, తెలంగాణకు 3,700, ఏపీకి 5,300 సీట్లు మాత్రమే ఉండాలి. అయితే వీటి కన్నా ఎక్కువగానే ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో సీట్లు ఉన్నాయి. రానున్న పాతికేండ్లలో చిన్న పిల్లల వైద్యులు, కంటి వైద్యులు, నాడీ వ్యవస్థ శస్త్ర చికిత్స నిపుణులు, ఇతర స్పెషలిస్టు వైద్యుల అవసరాన్ని అంచనా వేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. సాధారణ చికిత్స, ఫార్మా, అనాటమీ సీట్ల కంటే ఈ విభాగాల వైద్యుల అవసరం ఎక్కువగా ఉందన్నారు.

ఉద్యోగాల పేరిట లైంగిక దాడి

రాజస్థాన్‌లో హైకోర్టు ఆదేశాలతో కేసు

జైపూర్: రాజస్థాన్‌లో దారుణం చోటుచేసుకుంది. ఉద్యోగాలిప్పిస్తామని మభ్యపెట్టి ఒక ప్రజాప్రతినిధి, ఒక ఉన్నతాధికారి మహిళలపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. ఇంత దారుణానికి పాల్పడినా కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దాంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సిరోచి మున్సిపల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మహేంద్ర మేవాడ, మున్సిపల్ కౌన్సిల్ మాజీ కమిషనర్ మహేంద్ర చౌదరి 20 మంది మహిళలపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. దానిని వీడియో తీసి తమకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వకపోతే వాటిని సామాజిక మాధ్యమంలో వైరల్ చేస్తామంటూ బాధితులను తీవ్రంగా బెదిరించారు. అయితే బాధితుల్లో ఒకరు పాలి జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెకు మద్దతుగా మరికొందరు రావడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. అంగన్‌వాడీలో ఉద్యోగం ఇప్పిస్తామని వీరిని కొన్ని నెలల క్రితమే రప్పించారు. మత్తుమందు కలిపిన భోజనాన్ని పెట్టి సామూహిక లైంగిక దాడికి పాల్పడి, దానిని వీడియో తీసి బెదిరించే వారు. స్వప్రయోజనాల కోసం వారిని లైంగికంగా వాడుకునే వారు.

నవాజ్ షరీఫ్

ఇమ్రాన్ ఖాన్

సంకీర్ణం దిశగా పాక్

- **ఆర్మీ మద్దతుతో ముందంజలో ఉన్న నవాజ్ షరీఫ్ పార్టీ**
- **101 స్థానాలో ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారుల విజయం**
- **ఫలితాలపై వివిధ కోర్టులకు వెళ్లువెత్తిన ఫిర్యాదులు**

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11: పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఎట్టకేలకు ఆదివారం వెలువడ్డాయి. వీటిని పరిశీలిస్తే దేశంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పనిసరిలా కన్పిస్తున్నది. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాని పరిస్థితుల్లో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు పార్టీలు చకచకా పావులు కదుపుతున్నాయి. మరో పక్క పలుచోట్ల ఎన్నికల ఫలితాలను సవాల్ చేస్తూ పీటీఐ మద్దతుదారులు కోర్టుల్లో కేసులు దాఖలు చేశారు. పీటీఐ మద్దతుదారులు అధిక సంఖ్యలో విజయం సాధించినప్పటికీ ఫలితాలల్లో తీవ్ర అవకత వకలకు పాల్పడ్డారంటూ పీటీఐ ఆరోపించింది. కాగా, ఫలితాల అనంతరం సాంకేతికంగా అతి పెద్ద పార్టీగా నిలిచి, ఆర్మీ మద్దతు ఉన్న నవాజ్ షరీఫ్ ముందంజలో ఉన్నారు. 266 మంది సభ్యుల జాతీయ అసెంబ్లీలో 265 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అందులో 264 స్థానాల ఫలితాలు వెల్లడి కాగా, ఒక ఫలితాన్ని నిలిపివేశారు. ఈ ఎన్నికల్లో ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ మద్దతుతో ఇండిపెండెంట్లుగా పోటీ చేసిన 101 మంది విజయం సాధించారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చెందిన పీఎంఎల్-ఎన్ 75, బిల్వాల్ జర్దారి భుట్టోకు చెందిన పీపీపీ 54 సీట్లు గెల్చుకున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు మేజిక్ ఫిగర్ 133. ఈ నేపథ్యంలో పీపీపీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు షరీఫ్ నేతృత్వంలోని పీఎంఎల్-ఎన్ జోరుగా మంతనాలు సాగిస్తున్నది. నవాజ్‌కు అనుకూలంగా పాక్ సైన్యాధ్యక్షుడు ఆసీమ్ మునీర్ కూడా రంగంలోకి దిగారు. దేశంలో ప్రజాస్వామ్య శక్తులన్నీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అత్యధిక ఆన్‌లైన్ 'వ్యాయామ' వీడియోలు

గిన్నిస్ రికార్డుతో ఇస్రోకు అంకితం

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయాలకు కృతజ్ఞత తెలియజేస్తూ బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీ వినూత్న కార్యక్రమానికి పిలుపునిచ్చింది. పాదాలు, మోచేతులు నేలకు ఆనిస్తూ (అబ్డోమినల్ ప్లాంక్ పొజిషన్) ఆదివారం చేపట్టిన వ్యాయామ విన్యాస వీడియోలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నాయి. ఇస్రో విజయాలకు గుర్తుగా బెంగళూరులోని శ్రీకంఠీరవ ఔటడోర్ స్టేడియంలో సామూహిక వ్యాయామ విన్యాసం నిర్వహించారు. కాళ్లు..మోచేతులు నేలకు ఆనించి..చేపట్టిన ప్రత్యేక వ్యాయామ విన్యాసానికి సంబంధించి 5,194 వీడియోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యాయని సదరు ప్రైవేట్ కంపెనీ ప్రకటించింది.

పిల్లల్ని కంటే 62 లక్షలు

సియోల్: తమ దేశంలో పడిపోతున్న జనన రేటును పెంచేందుకు దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ నిర్మాణ రంగ కంపెనీ బూయంగ్ ఉద్యోగులకు భారీ ఆఫర్ ప్రకటించింది. పిల్లల్ని కన్న ప్రతిసారి రూ.62.54 లక్షలు (100 మిలియన్ల కొరియన్ వాన్లు) చెల్లిస్తామని తెలిపింది. 2021లో 70 మంది పిల్లలకు జన్మనిచ్చిన ఉద్యోగులకూ రూ.43.77 లక్షలు చెల్లించాలని యోచిస్తున్నది. ముగ్గురు పిల్లలున్న ఉద్యోగులకు రూ.1.86 కోట్ల నగదు లేదా అద్దె ఇంటి సదుపాయాన్ని కల్పించాలని అనుకుంటున్నది. ఈ ఆఫర్లు ఆడ, మగ ఉద్యోగులిద్దరికీ వర్తిస్తాయంది. 2022లో ప్రపంచంలో అతి తక్కువ సంతానోత్పత్తి రేటు దక్షిణ కొరియాలో నమోదైంది.

ఎక్కడ దాక్కున్నా ఖతమే!

బీజింగ్: యుద్ధరంగాన్ని సమూలంగా ప్రభావితం చేయగల అద్భుత టెక్నాలజీని ఆవిష్కరించినట్టు చైనా తెలిపింది. అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ టెక్నాలజీలో తిరుగులేని విజయం సాధించామని పేర్కొన్నది. 'యుద్ధరంగంలో ఎక్కడ దాక్కున్నా పసిగట్టి ధ్వంసం చేయగలం' అని ప్రకటించింది. భవిష్యత్తులో యుద్ధాల్లో ఎల్రక్టానిక్స్‌దే కీలకపాత్ర అని భావిస్తున్నారు. దీంతో ఈ రంగంపై దృష్టిపెట్టిన చైనా శాస్త్రవేత్తలు.. యుద్ధరంగంలో శత్రువు ఎక్కడ దాక్కున్నా పసిగట్టి నాశనం చేయగల సాంకేతికతను అభివృద్ధి చేసినట్టు బీజింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తెలిపింది. ఈ సాంకేతికత శత్రువుల ఎలక్ట్రానిక్ సిగ్నళ్లను అడ్డుకొని నాశనం చేస్తుందని తెలిపింది.

- **మరో లక్ష్యం దిశగా